ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



5 జనగామ

గురువారం 29 ఫిబ్రవరి 2024

మేడారం వైభవం వెయ్యేళ్లు గుర్తుండేలా కృషి

- అధికారుల సమన్వయంతో జాతర విజయవంతమైంది
- వచ్చే విద్యాసంవత్సరం నుంచి ట్రైబల్ వర్సిటీలో అడ్మిషన్లు
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



7



వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



సమ్మక్కగుడిలో ముగ్గులు వేస్తున్న మహిళలు



సమ్మక్కగుడి వద్ద యాట మొక్కులు చెల్లిస్తున్న పూజారులు



ఘనంగా తిరుగువారం

- మేడారం మహాజాతరలో చివరిఘట్టం పూర్తి
- ప్రత్యేక పూజలు చేసిన వడ్డెలు.. భారీగా హాజరైన భక్తులు
- మొక్కులు చెల్లించుకునేందుకు తరలొచ్చిన జనం



7

చివరి ఘట్టం ఘనంగా ముగిసింది. కోట్లాది మంది భక్తుల ఆరాధ్య దైవాలైన మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతర పరిసమాప్తమైంది. చివరి వేడుక అయిన తిరుగువారం పండుగ బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఆదివాసీ పూజారులు ఇలవేల్పులైన సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల ఆలయాలను శుద్ధి చేశారు. అలుకు పూతలతో మహిళలు తీర్చిదిద్దారు. ఇష్టదైవాలకు మొక్కుకున్నారు. ఈ సందర్భంగా పూజారులు యాటమొక్కులు తీర్చుకున్నారు. కాగా, తిరుగువారం పండుగకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. దీంతో మేడారం పరిసరాలు సందడిగా కనిపించాయి. జంపన్నవాగులో స్నానం చేసి అమ్మవార్ల గద్దెలకు మొక్కుకున్నారు. - మేడారం



'మేడిగడ్డ' మే సవాల్!

కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్, బీఆర్ఎస్ బాహాబాహీ

- కాంగ్రెస్‌కు రాజకీయాస్త్రంగా పిల్లర్ల కుంగుబాటు
- ప్రతి దాడికి సిద్ధమైన 'గులాబీ'దళం
- రేపు బీఆర్ఎస్ ప్రజాప్రతినిధుల 'చలో మేడిగడ్డ'
- కేటీఆర్, హరీష్‌రావు సహా కీలక నేతల రాక
- 2న కరీంనగర్ సభకు హాజరవనున్న కేసీఆర్
- లోక్‌సభ ఎన్నికల వేళ రాజుకుంటున్న మేడిగడ్డ వేడి

వరంగల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): మేడిగడ్డ పోరుగడ్డగా మారుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు డిజైన్‌పై తొలి నుంచి వ్యతిరేకత వ్యక్తం చేస్తున్న కాంగ్రెస్.. అనూహ్యంగా అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవటంతో దాన్ని అసెంబ్లీ ఎన్నికల్లో ప్రచారాస్త్రంగా మలచుకుంది. స్వయంగా కాంగ్రెస్ జాతీయ నేత రాహుల్‌గాంధీ మేడిగడ్డ బ్యారేజీకి వెళ్లి పరిశీలించారు. రూ.లక్ష కోట్ల వరకు ఖర్చు చేసి కట్టిన ప్రాజెక్టు పనికిరాకుండా పోయిందని కాంగ్రెస్ దుమ్మెత్తి పోస్తోంది. ఈ క్రమంలో బీఆర్ఎస్ కూడా ఎదురుదాడికి దిగుతోంది. మూడు పిల్లర్లు కూలితే ప్రాజెక్టే పనికి రాదంటున్నారని అసహనం వ్యక్తం చేస్తోంది. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండటంతో కాంగ్రెస్‌కు దీటుగా చలో మేడిగడ్డ పేరుతో మార్చి 1న బీఆర్ఎస్ తన ప్రజాప్రతినిధులతో కలిసి మేడిగడ్డ బ్యారేజీ పర్యటనకు సిద్ధమవుతోంది. ఇలా రెండుపార్టీల నేతలు 'మేడిగడ్డ'మే సవాల్.. తేల్చుకుందాం అంటూ మాటల తూటాలు పేలుస్తుండటం.. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాష్ట్ర రాజకీయాలు మరింత వేడెక్కుతున్నాయి.

అందరిచూపు మేడిగడ్డ వైపే..

సుమారు రూ.98వేలకోట్లు ఖర్చు చేసిన కాళేశ్వరం ప్రాజెక్టులో మేడిగడ్డ బ్యారేజీ అంత్యంత కీలకమైనది. అయితే గత ఏడాది అక్టోబరు 21న రాత్రి బ్యారేజీలోని 7వ బ్లాక్‌లో 21వ పిల్లర్ పెద్ద శబ్దంతో కుంగిపోయింది. అసెంబ్లీ ఎన్నికల సమయం కావటంతో ప్రతిపక్షాలకు మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటు ప్రచారాస్త్రంగా మారింది. ప్రధానంగా కాంగ్రెస్ పార్టీ మేడిగడ్డ బ్యారేజీ కుంగుబాటుపై ఎన్నికల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించింది. ఏకంగా ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీని నవంబరు 2న మేడిగడ్డకు తీసుకెళ్లిన కుంగిన బ్యారేజీని చూపించి, నాణ్యత లోపంతో బ్యారేజీ కుంగిందని, కాళేశ్వరం కమీషన్ల ప్రాజెక్టుగా ప్రజల్లోకి తీసుకెళ్లింది. అదే సమయంలో బీజేపీ నేతలు కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్, లక్ష్మణ్ లాంటివారు సైతం మేడిగడ్డను సందర్శించి విమర్శలు గుప్పించారు. నవంబరులో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక మేడిగడ్డ బ్యారేజీపై మరింతగా దృష్టి పెట్టి బీఆర్ఎస్‌ను ఇరుకాటంలో పెట్టింది.

గత ప్రభుత్వ వైఫల్యాలపై కాంగ్రెస్ ఫోకస్







కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత బ్యారేజీ కుంగుబాటుపై వేగంగా విచారణ మొదలైంది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోడంపై సీఎం రేవంత్‌రెడ్డి సీరి యస్‌గా తీసుకున్నారు. ఈ వైఫల్యం వెనుక కేసీఆర్ ప్రభుత్వంలో బాధ్యులు ఎవరు అనేదానిపై ప్రధానంగా ప్రభుత్వం దృష్టిపెట్టింది. దీంతో డిసెంబరు 11వ తేదీన భారీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో జలసౌధలో నీటిపారుదశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. కాళేశ్వరం ప్రాజెక్టు రిపోర్టు మొత్తం తమకు సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఆ తరువాత 16వ తేదీన శాసన మండలిలో సీఎం రేవంత్‌రెడ్డి మేడిగడ్డపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయిస్తామని ప్రకటించారు. 17వ తేదీన నీటిపారుదలశాఖ అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టుపై సమీక్ష చేశారు. డిసెంబరు 18వ తేదీన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కాళేశ్వరం చీఫ్ ఇంజనీర్లు మురళీధర్, నల్లా వెంక టేశ్వర్లు, బి.నాగేంద్రతో పాటు ఎల్అండ్‌టీ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ దేశాయ్ తదితరులతో మేడిగడ్డపై సమీక్ష నిర్వహించారు. డిసెంబరు 29వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి బృందం మేడిగడ్డ బ్యారేజీని సందర్శించి కుంగిన ప్రాంతాన్ని పరిశీలించింది. విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఫిబ్రవరి 7వ తేదీన ప్రాజెక్టులో భాగస్వామ్యమైన ఈఎన్‌సీలు మురళీధర్, నల్లా వెంకటేశ్వర్లుపై ప్రభుత్వం వేటు వేసింది. ఫిబ్రవరి 13న సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా మేడిగడ్డలో పర్యటించారు. మంత్రులతో పాటు కాంగ్రెస్, సీపీఐ, ఎంఐఎం ఎమ్మెల్యేలతో కలిసి మేడిగడ్డను సందర్శించారు. వరుసగా ప్రభుత్వం మేడిగడ్డపై ఫోకస్ చేసింది. మేడిగడ్డ కుంగిపోవటంతో బ్యారేజీని పునరుద్ధరించటం కష్ట మని, దీనికి ప్రత్యామ్నాయంగా ప్రాణహిత-చేవేళ్ల ప్రాజెక్టును పునరుద్ధరి స్తామనే సంకేతాలను ప్రభుత్వం ఇస్తోంది. లక్ష కోట్లు ఖర్చు చేసి కాళేశ్వరం ప్రాజెక్టుతో కనీసం లక్ష ఎకరాలకు కూడా సాగు నీరు ఇవ్వలేదని కాంగ్రెస్ ఆరోపణలు చేస్తోంది.







కౌంటర్‌కు 'గులాబీ' సన్నాహాలు

మేడిగడ్డ బ్యారేజీ కుంగుపాటుపై ప్రభుత్వం వరుసగా విచారణలు, సమీక్షలు, సీఎం, మంత్రులు పర్యటనలతో కాళేశ్వరం లోపాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తోంది. ఫిబ్రవరి 13వ తేదీన సీపీఐ, ఎంఐఎం ఎమ్మెల్యేలను కూడా మేడిగడ్డకు తీసుకరావటంతో గులాబీ పార్టీ సంది గ్ధంలో పడింది. మౌనంగా ఉంటే కాళేశ్వరంపై ప్రభుత్వం, కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం

మిగతా 6వ పేజీలో..

టార్గెట్ ఎంపీ ఎన్నికలు

వచ్చే లోక్‌సభ ఎన్నికలే లక్ష్యంగా కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు వ్యూహాత్మంగా మేడిగడ్డ బ్యారేజీ అంశాన్ని తెరపైకి తెస్తున్నాయనే ప్రచారం సాగుతోంది. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా పెద్దపల్లి, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్, జహీరాబాద్, నల్లగొండ, భువనగిరి లోక్‌సభ పరిధిలోని రైతాంగానికి సాగు నీరు అందాల్సి ఉంది. ప్రస్తుతం మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోవటంతో ఎత్తిపోతలు నిలిచిపో యాయి. అంతేకాకుండా ప్రాజెక్టు పనులు కూడా నిలిచి పోయాయి. ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టుకు పనికిరాదని కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం ప్రజల్లోకి వెళుతుండటంతో గులాబీ పార్టీ కౌంటర్ పాలిట్రిక్స్‌లోకి దిగింది. మూడు పిల్లర్లను పునరిద్ధరిస్తే సరిపోతుందని, కేసీఆర్‌కు పేరు రావద్దని కాంగ్రెస్ నాటకాలు ఆడుతోందని ఆరోపిస్తు ఎన్నికల్లో ప్రచారానికి సిద్ధం అవుతోంది. దీంతో మేడిగడ్డ బ్యారేజీ ఎన్నికల పోరుకు అడ్డగా మారిందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- తొలి రోజు 95.44 శాతం విద్యార్థులు హాజరు



జనగామలో పరీక్షల సరళిని పరిశీలిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 28: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు బుధ వారం ప్రారంభమయ్యాయి. సంబంధిత పోలీస్‌స్టేషన్‌ల నుంచి ప్రశ్నప త్రాలను భారీ బందోబస్తుతో పరీక్షా కేంద్రాలకు తరలించారు. తహసీల్దార్ స్థాయిలో రెవెన్యూ అధికారులు, ఎస్ఐ స్థాయిలో పోలీసులు పరీక్షలను పర్య వేక్షించారు. ప్రథమ సంవత్సరం జనరల్ విద్యార్థులకు తెలుగు, వొకేషనల్ విద్యార్థులకు జీఎఫ్‌సీ పరీక్షలు నిర్వహించారు. మొత్తం 4610 మంది విద్యార్థులకు గాను 210 మంది గైర్హాజరు కాగా 4400 మంది (95.44%) విద్యార్థులు హాజరైనట్లు డీఐఈవో భైరి శ్రీనివాస్ తెలిపారు. దేవరుప్పులలో ఒక మాల్ ప్రాక్టీస్ కేసు నమోదైందన్నారు. పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్, సిట్టింగ్ స్క్వాడ్, డెక్ సభ్యులు సందర్శించారు. ఈ సారి అదనంగా ఒక రెవెన్యూ అధికారిని పరీక్షా కేంద్రాలకు ప్రత్యేకాధికారులుగా నియమించారు. జనగామ పోలీస్ స్టేషన్‌లో డీఐఈవో భైరి శ్రీనివాస్ సీఎస్, డీవోలకు తగు సూచనలు, సలహాలు అందించారు. కాగా ఇంటర్ పరీక్షలకు ఎన్నడూ లేని విధంగా గ్రూప్-1 మొదలగు పోటీ పరీక్షలు, ఐఏఎస్, ఐపీఎస్ పరీక్షల రేంజ్‌లో పర్యవేక్షణ, బందోబస్తు ఏర్పాటు చేయడం పట్ల విద్యార్థులు ఆందోళనకు గురైనట్లు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు.

పరీక్షల సరళిని పరిశీలించిన కలెక్టర్...

ఇంటర్ పబ్లిక్ పరీక్షలను కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా పరిశీలించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలను ఆయన సందర్శించి సీసీ కెమెరాలను పరిశీలించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పరీక్షలకు అన్ని ఏర్పా ట్లు పూర్తి చేశామన్నారు. విద్యార్థులు మానసిక ఒత్తిడిని తట్టుకునేందుకు టెలిమానస్ సేవలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట జిల్లా ఇంటర్ విద్యాధికారి భైరి శ్రీనివాస్, సెంటర్ ఇన్‌చార్జి, సీపీవో ఇస్మాయిల్ ఉన్నారు.



దేవరుప్పుల ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వస్తున్న విద్యార్థులు

ఒగ్గురవికి గోల్డ్‌మెడల్

- గవర్నర్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టా



గవర్నర్ తమిళిసై చేతుల మీదుగా గోల్డ్‌మెడల్‌తో పాటుగా డాక్టరేట్ పట్టాను అందుకుంటున్న ఒగ్గు రవి

లింగాలఘణపురం, ఫిబ్రవరి28: మండలంలోని మాణిక్యాపురం గ్రామానికి చెందిన ఒగ్గురవి డాక్టరేట్ పట్టాతో పాటు గోల్డ్‌మెడల్ అందుకున్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం రంగస్థల కళల శాఖ నుంచి 'ఒగ్గుకథ-నాటకీయ లక్షణాలు' అనే అంశంపై విస్తృత పరిశోధన చేసి సమర్పించిన సిద్ధాంత గ్రంథానికి గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ చేతుల మీదుగా డాక్టరేట్ పట్టాను అందుకున్నారు. బుధవారం రవీంద్రభారతి వేదికగా జరిగిన పొట్టిశ్రీరాములు విశ్వవిద్యాలయం 16వ స్నాతకోత్సవం సందర్భంగా ఒగ్గురవికి డాక్టరేట్ పట్టాతో పాటు గోల్డ్‌మెడల్‌ను అందించారు. కార్యక్రమంలో పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్స్‌లర్ తంగడ కృష్ణరావు, రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేశ్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత కళా కృష్ణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ కోట్ల హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరాన్ని రాజకీయాలకు వాడుకోవద్దు

- 17ఎంపీ స్థానాలు గెలిచి మగాడివనిపించుకో..
- సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే కడియం శ్రీహరి సవాల్

8లో

రికవరీ పేరిట ఓవరాక్షన్

- మితిమీరుతున్న ఫైనాన్స్ ఏజెంట్ల ఆగడాలు
- నిబంధనలకు విరుద్ధంగా వాహనాల సీజ్
- కంపెనీకి సంబంధం లేని వ్యక్తుల ప్రమేయం?



జనగామ టౌన్, ఫిబ్రవరి 28: కుటుంబ అవసరాలకో, వ్యాపార వినియోగానికో అనేక మంది ద్విచక్ర వాహనాలతో పాటు ఇతర వాహనాలను కొనుగోలు చేస్తుంటారు. ఎక్కువ మంది పేదలు, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు ఒకేసారి మొత్తం నగదు చెల్లించే స్తోమత లేక ఫైనాన్స్‌లో కొనుగోలు చేస్తుంటారు. వాహనం కొనే ముందు పోటీ పడి మరీ కస్టమర్ల వద్దకు ఆయా ఫైనాన్స్ కంపెనీల ప్రతినిధులు వస్తుంటారు. తీయని మాటలు చెప్పి.. వాహనం చేతికిచ్చాక కిస్తీల విషయంలో చుక్కలు చూపిస్తారు. అయితే ఎక్కువగా ఫైనాన్స్‌పై అవగాహన లేని వారే ఉండడంతో ఫైనాన్స్ కంపెనీల రికవరీ ఏజెంట్లు ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారు. పరిస్థితులు బాగా లేక కిస్తీ ఆగిపోతే వినియోగదారులకు నరకం చూపిస్తున్నారు. నిబంధనల ప్రకారం మూడు లేదా అంతకు మించి కిస్తీలు పెండింగ్‌లో ఉంటే వాహనాలను సీజ్ చేస్తారు. వాహనాన్ని సీజ్ చేసే ముందు తప్పకుండా నోటీస్ ఇవ్వాలి. కానీ ఇవేమీ పాటించడంలేదు. మరోవైపు కంపెనీ ప్రతినిధులు కాకుండా సంబంధం లేని వ్యక్తులు కూడా ఇందులో తలదూర్చుతున్నారు. ఎటువంటి సమాచారం లేకుండా వాహనాలను సీజ్ చేస్తున్నారు.

అవగాహన లేని ఏజెంట్లు..

కొన్ని ఫైనాన్స్ కంపెనీలు ఎలాంటి అవగాహన లేని వ్యక్తులను ఏజెంట్లుగా చేర్చుకోవడం వల్ల కూడా సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వాహనాన్ని సీజ్ చేస్తే కంపెనీలు ప్రోత్సాహకంగా కొంత కమీషన్ ఇస్తాయి. అంతేగాకుండా ఈఎంఐల కలెక్షన్‌ను బట్టి ఇన్సెంటివ్‌లు ఇస్తుంటాయి. వీటి కోసం నిజాయితీగా పనిచేస్తే మంచిదే. కానీ ఇన్సెంటివ్‌లు, కమీషన్ల ఆశతో కొందరు నిబంధనలను మరిచిపోతున్నారు. ఇంకొందరు ప్రత్యేకంగా ప్రైవేటు వ్యక్తులను నియమించుకుని రికవరీ పనులు చేయిస్తున్నారు. మూడు కిస్తీలు దాటకముందే అత్యుత్సాహంతో నిబంధనలకు విరుద్ధంగా సీజింగ్‌కు పాల్పడుతున్నారు. జనగామ పట్టణానికి చెందిన ఓ యువకుడు ట్రావెల్స్ నడుపుతూ జీవనోపాధి పొందేందుకు రెండేళ్ల క్రితం ఫైనాన్స్‌లో కారు కొన్నాడు. కిస్తీలు సమయానికి కడుతూనే వస్తున్నాడు. ఆయన ఒక కిస్తీ బకాయి ఉండగా.. మరో కిస్తీ వచ్చి రెండు రోజులైంది. అదే సమయంలో ఆ యువకుడి తండ్రికి ఆరోగ్యం బాగా లేకపోతే హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తీసుకెళ్తున్నాడు. ఈ క్రమంలో సికింద్రాబాద్ వద్ద రికవరీ ఏజెంట్లు ఇద్దరు వచ్చి బండి పక్కకు ఆపేశారు. రెండు కిస్తీలు కట్టాల్సిందేనని, లేదంటే బండి తమకు అప్పగించాలని పట్టుబట్టారు. సీజింగ్ డిపార్ట్‌మెంట్‌కు సంబంధించి తమ ఐడీ కార్డులు చూపాలని సదరు కిస్తీదారుడు నిలదీయగా వారు అక్కడి నుంచి వెళ్లిపోయారు. కంపెనీకి సంబంధం లేని ప్రైవేటు వ్యక్తులతో వారు రికవరీ చేయిస్తున్నారని ఆయన ఆరోపించారు. జనగామకు చెందిన మరో వ్యక్తి స్నేహితుడి కారు తీసుకుని కుటుంబ సభ్యులతో హైదరాబాద్‌కు వెళ్లాడు. ఈ కారు ఫైనాన్స్‌కు సంబంధించిన రికవరీ ఏజెంట్లు అక్కడ ప్రత్యక్షమై కారును నిలిపివేసి నానా హంగామా చేశారు. పెండింగ్‌లో ఉన్న రెండు కిస్తీలు కడితేనే కారు కదులుతుందని హెచ్చరించడంతో ఆ కారు ఓనరు ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధికి ఫోన్ చేశారు. సదరు ప్రతినిధి రికవరీ ఏజెంట్లకు ఫోన్ చేసి రెండు కిస్తీలకు కారు ఆపాలని ఎవరు చెప్పారని ప్రశ్నించడంతో వారు కారును వదిలేశారు. ఇలా నిబంధనలు తెలియకున్నా కొందరు కిందిస్థాయి ఏజెంట్లు అత్యుత్సాహం చూపిస్తున్నారు. జనగామకు చెందిన ఓ యువకుడు గతంలో మూడు కిస్తీలు పెండింగ్‌లో ఉండగా.. మరో కిస్తీ దాటొద్దని హెచ్చరించారు. దీంతో ఆయన ఈఎంఐలు క్లియర్ చేశారు. కానీ ఇటీవల అదే వ్యక్తి రెండు ఈఎంఐలు పెండింగ్‌లో ఉండగా రికవరీ ఏజెంట్లు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా సీజ్ చేసేశారు.

మార్చిలో మరింత కఠినం..

మార్చి నెలతో ఆర్థిక సంవత్సరం ముగుస్తుండడంతో ఫైనాన్స్ ఏజెంట్లు మరింత రెచ్చిపోతుంటారు. ఎక్కువ మొత్తంలో కలెక్షన్లు చేయాలనే ఉద్దేశ్యంతో నిబంధనలు పాతరేస్తారని పలువురు ఫైనాన్స్ విభాగంలో పనిచేసే ఉద్యోగులే చెబుతున్నారు. ఒక్క నెల ఈఎంఐ పెండింగ్‌లో ఉన్నప్పటికీ వాహనాలను అన్యాయంగా సీజ్ చేస్తారని, రికవరీ ఏజెంట్ల పైఅధికారులు ఈ మేరకు ఒత్తిడి తీసుకొస్తారని తెలిసింది. ఏదిఏమైనా బతుకుదెరువు కోసం, కుటుంబ అవసరాల కోసం ఫైనాన్స్‌లో బండ్లు తీసుకున్నందుకు తాము రికవరీ ఏజెంట్లతో తీవ్రంగా ఇబ్బందులు పడాల్సి వస్తోందని పలువురు బాధితులు వాపోతున్నారు.

ఇలాంటి సంఘటనలపై సదరు ఫైనాన్స్ కంపెనీలు చర్యలు తీసుకుని, నిబంధనలు పాటించేలా చూడాలని కోరుతున్నారు.

జులాజికల్ పార్కు తనిఖీ

సుబేదారి, ఫిబ్రవరి 28: హనుమకొండలోని కాకతీయ జులాజికల్ పార్కును రాష్ట్ర పర్యావరణ, అటవీ, టెక్నాలజీ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎ. వాణీప్రసాద్ బుధవారం తనిఖీ చేశారు. జులాజికల్‌పార్కుతో పాటు హరితనిధి, కేయూ నర్సరీని ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సెక్రెటరీ వాణీప్రసాద్ జూపార్కు అధికారులకు, సిబ్బందికి వణ్యప్రాణుల సంరక్షణకై పలు సూచనలు చేశారు. ప్రిన్సిపల్ సెక్రెటరీ వెంట ఫారెస్టు అధికారులు శివానీ డోగ్రా, బి. లావణ్యతో పాటు ఎఫ్‌ఆర్‌వోలు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

శివరాత్రికి ఆధ్యాత్మిక, సాంస్కృతిక సమ్మేళనం


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న భద్రకాళి శేషు, రాకేష్‌రెడ్డి

కాళోజీ జంక్షన్, ఫిబ్రవరి 28: సనాతన ధర్మ విశిష్టతను ప్రపంచానికి చాటి చెప్పడానికి శివరాత్రికి ఆధ్యాత్మిక, సాంస్కృతిక సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు భద్రకాళి అమ్మవారి ప్రధానార్చకుడు శేషు అన్నారు. ప్రతీ ఏటా నిర్వహించినట్లుగానే ఈ యేడు ఇండస్ ఫౌం డేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని హయగ్రీవచారి గ్రౌండ్‌లో మహా శివరాత్రి ఆధ్యాత్మిక, సాంస్కృతిక సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇలాంటి చైతన్యవంతమైన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా శేషుతో పాటు ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్‌రెడ్డి, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి చేతుల మీదుగా సమ్మేళన కరపత్రాన్ని ఆవిష్కరించారు. పరశివుడి ఔనత్యాన్ని చాటడానికి ఇండస్ ఫౌండేషన్ ఏర్పాటు చేసిన కార్యక్రమం అభినందనీయమని ఆయన ప్రశంసించారు. ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ.. ఓరుగల్లు శివతత్వానికి పెట్టిన పేరని అలాంటి నగర విశిష్టతను తెలియజేయడమే ఫౌండేషన్ లక్ష్యమని అన్నారు. పూర్వ వైభవాన్ని తీసుకొచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్న విశిష్ట వ్యక్తులకు కాకతీయ పురస్కారం ఇచ్చి గౌరవించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో శివ పార్వతి కల్యాణం, బ్రహ్మశ్రీ గంగాధర శాస్త్రి, రాధామనోహర్ దాస్ ప్రవచనాలు, సప్తహారతి, పేరిణి శివతాండవంతో పాటు ప్రముఖ సినీ సంగీత దర్శకుడు వందేమాతరం శ్రీనివాస్, శరణ్ అర్జున్, వివిధ సినీ జానపద కళాకారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని తెలిపారు. వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఇంకా మహా శివరాత్రి కార్యక్రమ నిర్వాహక కో ఆర్డినేటర్ కత్తుల అభిషేక్, వెలగందుల దీపక్ తదితరులు పాల్గొన్నారు.

'మేడిగడ్డ' మే సవాల్!

(5వ పేజీ తరువాయి)

ప్రజల్లోకి వెళుతోందని, కౌంటర్ అటాక్ చేయాలని గులాబీ పార్టీ భావిస్తోంది. దీంతో మార్చి 1వ తేదీన చలో మేడిగడ్డ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కాళేశ్వ రం ప్రాజెక్టు అంటే కేవలం మేడిగడ్డ బ్యారేజీ మాత్రమే కాదని వాదిస్తోంది. కేవలం మూడు వేల కోట్లు వెచ్చించిన మేడిగడ్డ బ్యారేజీలోని మూడు పిల్లర్లు కుంగితే.. లక్ష కోట్లతో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు పనికి రాదని కాంగ్రెస్ రాద్ధాంతం చేస్తోం ది. బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. కుంగిన పిల్లర్లను మరమ్మతు చేసి, కాళేశ్వరం ద్వారా రైతులకు సాగు నీరు అందించాలని బీఆర్ఎస్ డిమాండ్ చేస్తూ చలో మేడిగడ్డ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులతోపాటు పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, మాజీ ప్రజాప్రతినిధులతో కలిసి మేడిగడ్డ పర్యటనకు గులాబీ పార్టీ ప్లాన్ చేస్తోంది. మార్చి 2వ తేదీన కరీంనగర్‌లో భారీ బహిరంగ సభ నిర్వహించి కాంగ్రెస్‌కు కౌంటర్ ఇవ్వాలని భావిస్తోంది. ఈ సభలో స్వయంగా కేసీఆర్ మేడిగడ్డపై మాట్లాడనున్నారు. అక్టోబరు 21న మేడిగడ్డ బ్యారేజీ కుంగితే.. అప్పటి నుంచి ఈ ఘటనపై కేసీఆర్ స్పందించలేదు. అయితే కరీంనగర్ సభలో కేసీఆర్ మేడిగడ్డపై మాట్లాడనుండటంతో గులాబీ శ్రేణుల్లో ఆసక్తికరంగా మారింది.

























ఘనంగా తిరుగువారం





మేడారం మహాజాతరలో చివరిఘట్టం పూర్తి

ప్రత్యేక పూజలు చేసిన వడ్డెలు.. భారీగా హాజరైన భక్తులు

మేడారం, ఫిబ్రవరి 28 : మేడారం మహాజాతర అత్యంత వైభవంగా జరిగింది. ఈ క్రమంలో సంప్రదాయం ప్రకారం చివరిఘట్టంగా నిర్వహించే తిరుగువారం పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వనదేవతలకు వడ్డెలు (పూజారులు) ప్రత్యేక పూజలు చేశారు. గద్దెలు, గ్రామంలోని గుడిని శుద్ధి చేశారు. ఆడపడుచులు.. అలుకుపూతలతో రంగురంగుల ముగ్గులు వేసి అందంగా అమ్మవార్ల గద్దెలను అలంకరించారు. అనంతరం డోలు వాయిద్యాల నడుమ తల్లులకు ధూపదీప నైవేద్యాలు సమర్పించగా.. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని యాటమొక్కులు సమర్పించుకున్నారు. అనంతరం తల్లుల వన ప్రదేశాలకు వెళ్లి రహస్య పూజలు చేశారు. కన్నెపల్లిలో సారలమ్మ గుడిలో మేడారంలో సమ్మక్క గుడిలో, కొండాయిలో గోవిందరాజు గుడిలో, పునుగొండ్లలో పగిడిద్దరాజు గుడిలో ఈ పూజలు జరగ్గా.. పూజారులు కుటుంబీకులు, బంధుమిత్రులు, గ్రామస్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ద బోయిన జగ్గారావు, ఉపాధ్యక్షుడు కాక సారయ్య, పూజారులు కాక కిరణ్, కాక వెంకటేశ్వర్లు, సిద్దబోయిన మునీందర్, అరుణ్, అనిల్, కొక్కెర కృష్ణయ్య, రమేష్, పూర్ణచందర్, గ్రామపెద్దలు, పాల్గొన్నారు.

ముగిసిన జాతర.. భారీగా తరలొచ్చిన భక్తులు

ఈ నెల 7న గుడిమెలిగే పండుగ మొదలుకొని 14న మండమెలిగే పండుగ, 21, 22న వన దేవతలు గద్దెలకు చేరడం, 23న భక్తుల మొక్కులు, 24న వన ప్రవేశం జరిగింది. తదుపరి బుధవారం జరిగే తిరుగు జాతర పండుగ ముగియగా.. తిరుగువారం రోజున కూడా తల్లులు ఇక్కడే కొలువు దీరి ఉంటారనే నమ్మకంతో భక్తులు మేడారానికి పోటెత్తారు. సుదూర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు జంపన్న వాగులో స్నానాలు ఆచరించి తల్లులకు నిలువెత్తు బంగారాన్ని సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.



సమ్మక్కగుడిలో ముగ్గులు వేస్తున్న మహిళలు



సమ్మక్కగుడిలో పూజలు చేస్తున్న వడ్డెలు

ఆరు గ్యారెంటీలు అమలు చేయకపోతే

మీ భరతం పడతా

- అమ్మను అడ్డుపెట్టుకుని పొన్నం రాజకీయం చేస్తున్నాడు
- పీవీ ఇంటికెళితే కడుపు మండిన కాంగ్రెసోళ్లు నాపై కోడిగుడ్ల దాడి చేశారు
- పాదయాత్రలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్



ఎల్కతుర్తిలో పాదయాత్ర చేస్తున్న బండి సంజయ్

ఎల్కతుర్తి, ఫిబ్రవరి 28 : ఇచ్చిన హామీ మేరకు 100రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేయకపోతే ఆ పార్టీ నాయకుల భరతం పడతానని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ హెచ్చరించారు. ఆయన చేపట్టిన ప్రజాహిత పాదయాత్ర బుధవారం హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలో కొనసాగి.. రాత్రికి ఎల్కతుర్తి మండలంలోకి చేరుకుంది. మండలంలోని గోపాల్‌పూర్, చింతలపల్లి, దామెర, ఎల్కతుర్తి, సూరారం, దండేపల్లి గ్రామాల్లో పాదయాత్ర సందర్భంగా బండి సంజయ్ మాట్లాడుతూ.. పదేళ్లలో కేసీఆర్ రాష్ట్రానికి రూ.5 లక్షల కోట్ల అప్పులు చేస్తే అధికారం వచ్చిన 80రోజుల్లోనే కాంగ్రెసోళ్ల రూ.10వేల కోట్ల అప్పులు చేశారని ఆరోపించారు. ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోతే ప్రజలు కాంగ్రెస్ నాయకులను తరిమి కొడతారని, తెల్ల రేషన్‌కార్డులున్న వారికే గ్యారెంటీలను అందిస్తామని చెప్పడం ప్రజలను తప్పు దోవ పట్టించడమేనని విమర్శించారు. రేషన్ కార్డులే ఇవ్వని ప్రభుత్వం గ్యారెంటీలను ఎలా ఇస్తుందని ప్రశ్నించారు. రాముడి జన్మస్థలాన్ని ప్రశ్నించే వాళ్లను నేను నిలదీస్తే.. తన తల్లిని అవమానించానంటూ.. తల్లిని అడ్డుపెట్టుకుని ఈ ప్రాంత మంత్రి రాజకీయం చేస్తున్నాడని మంత్రి పొన్నం ప్రభాకర్‌పై పరోక్ష ఆరోపణలుచేశారు. తప్పుడు ఆరోపణలు చేస్తే అది ఆయన విజ్ఞతేనని, ఏ మూర్ఖుడు కూడా అమ్మను అడ్డుపెట్టుకుని విమర్శలు చేయరని గుర్తుచేశారు. ఈ ప్రాంతానికి చెందిన మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు మృతి చెందితే ఆయన భౌతిక కాయాన్ని కూడా పూర్తిగా కాలనీయని పరిస్థితి తీసుక వచ్చిన చరిత్ర కాంగ్రెస్ వాళ్లది కాదా అని ప్రశ్నించారు. అలాంటి వ్యక్తి సేవలను గుర్తించి.. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పీవీ నర్సింహరావుకు భారతరత్నను ప్రకటించి గౌరవించిందన్నారు. అలాంటి వ్యక్తి కుటుంబాన్నికలిసేందుకు స్వగ్రామానికి వెళ్తితే కడుపు మండిన కాంగ్రెస్ నాయకులు తనపై కోడి గుడ్లతో దాడిచేశారని, రాళ్ళు, కోడి గుడ్ల దాడులకు తాను భయపడే వ్యక్తిని కాదని, తనను అనవసరంగా గెలికారని, తాను కేసీఆర్‌కే భయపడలేదన్నారు. గతంలో కేసీఆర్ తెలంగాణను నాశనం చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం సర్వనాశనం చేయడానికి కంకణం కట్టుకుందని మండిపడ్డారు. అగ్ర వర్ణ పేదలకు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు కల్పించడమే కాకుండా కేంద్రంలో 27 మంది బీసీలను, 12 మంది ఎస్సీలను, 8 మంది ఎస్టీలను కేంద్ర మంత్రులకు పట్టం కట్టిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకి దక్కిందన్నారు. కాంగ్రెస్ నేతలకు దమ్ముంటే కేంద్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై చర్చకు రావాలని సవాల్ విసిరారు. కార్యక్రమంలో సిద్ధిపేట జిల్లా హుస్నాబాద్ నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జ్ బొమ్మ శ్రీరాం చక్రవర్తి, మాజీ ఎమ్మెల్యే బొడిగె శోభ, బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, నియోజక వర్గ నేతలు జన్నపురెడ్డి సురేందర్‌రెడ్డి, గుజ్జ సత్యనారాయణరావు, మండల పార్టీ అధ్యక్షుడు కుడితాడి చిరంజీవి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంజయ్ కాన్వాయ్‌పై

కోడిగుడ్లతో దాడి

- హనుమకొండ జిల్లా వంగరలో ఉద్రిక్తత






వంగరలో పోలీసులపై అసహనం వ్యక్తం చేస్తున్న ఎంపీ బండి సంజయ్ (ఇన్‌సెట్‌లో కోడి గుడ్ల దాడిలో కింద పడిన గుడ్డు)

భీమదేవరపల్లి, ఫిబ్రవరి 28: ప్రజాహిత పాదయాత్రలో భాగంగా మంగళవారం రాత్రి సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం నుంచి హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలంలోకి అడుగుపెట్టిన బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌కుమార్ కొత్తకొండలోని హరితహోటల్‌లో రాత్రి బసచేశారు. అయితే పీవీకి భారతరత్న వచ్చిన నేపథ్యంలో బుధవారం ఉదయం ఆయన వంగరలోని పీవీ కుటుంబ సభ్యులను కలిసి.. పీవీ ఇంట్లోని పీవీ విగ్రహానికి నివాళులర్పించి, పీవీ మనువడు ఎన్వీ సుభాష్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వంగర నుంచి భీమదేవరపల్లికి వెళ్తుండగా వంగర బస్టాండ్ సమీపంలో బండి సంజయ్ కాన్వాయ్‌పై గుర్తుతెలియని వ్యక్తులు కోడిగుడ్లు విసిరారు.

ఈ క్రమంలో బండి సంజయ్ పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రాత్రి తాను బస చేసిన కొత్తకొండ హరిత హోటల్ వద్ద వందలాది మంది పోలీసులు మోహరించారని, కానీ బుధవారం తాను వంగరలో పీవీ ఇంటికి వెళ్లివస్తుండగా తన కాన్వాయ్‌పై కోడిగుడ్ల దాడి జరగడం తీవ్ర బాధాకరమన్నారు. పోలీసుల వైఫల్యంతోనే తన కాన్వాయ్‌పై కోడిగుడ్ల దాడి జరిగిందని ఆరోపించారు. పోలీసులు, ఇంటెలిజెన్స్ వైఫల్యమే దీనికి కారణమన్నారు. తమ కార్యకర్తలు బుధవారం ఉదయం వంగరలో అవాంఛనీయ సంఘటనలు జరిగే అవకాశం ఉందని అప్రమత్తం చేసినా పోలీసులు పట్టించుకోలేదన్నారు. దీంతో తన కాన్వాయ్‌పై కోడిగుడ్ల దాడి జరిగిందని ఆరోపించారు. తనకు పోలీసుల బందోబస్తు అవసరం లేదని, తమ కార్యకర్తలకే తనకు రక్షణగా ఉంటారని, పోలీసులు తిరిగి వెళ్లిపోవాల్సిందిగా ఆయన కోరారు. ఆ తర్వాత అక్కడి నుంచి బండి సంజయ్ వెళ్లిపోగా.. కోడిగుడ్ల దాడి జరిగిన క్రమంలో వంగరలో ఉద్రిక్తత ఏర్పడింది.

మేడారం వైభవం వెయ్యేళ్లు గుర్తుండేలా కృషి

- అధికారుల సమన్వయంతో జాతర విజయవంతమైంది
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క వెల్లడి



ములుగు కలెక్టర్, ఎస్పీలను సన్మానిస్తున్న మంత్రి సీతక్క

ములుగు, ఫిబ్రవరి 28: మేడారం సమ్మక్క, సారలమ్మల చరిత్ర, మహాజాతర వైభవం వెయ్యేళ్లు గుర్తుండేలా కృషి చేస్తామని, జాతర సమగ్రాభివృద్ధికి పక్కాప్రణాళిక రూపొందిస్తామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. బుధవారం ములుగు జిల్లాలో పర్యటించిన సీతక్క జాకారంలోని వైటీసీ భవనాన్ని పరిశీలించారు. రామప్ప నుంచి లక్నవరం సరస్సులోకి గోదావరి జలాల తరలింపుపై జిల్లా కలెక్టర్, నీటిపారుదలశాలక అధికారులతో చర్చించారు. ఆ తర్వాత మేడారం జాతర విజయవంతంగా పూర్తయిన సందర్భంగా ములుగులోని గిరిజన భవన్‌లో కృతజ్ఞత సభ నిర్వహించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ.. తన 24ఏళ్ల రాజకీయ జీవితంలో పలుమార్లు మేడారం జాతర నిర్వహణను పరిశీలించానని, కానీ, తొలిసారి ప్రభుత్వ ప్రతినిధిగా ప్రత్యక్షంగా జాతరను జరిపించే అవకాశం లభించడం తన అదృష్టమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన కొద్దిరోజులకే వచ్చిన మేడారం జాతరకు రెండు దఫాలుగా రూ.105కోట్ల నిధులు విడుదల చేసి యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేశామని, కలెక్టర్, ఎస్పీ, అన్నిశాఖల అధికారులను సమన్వయం చేసుకొని జాతరను విజయవంతంగా నిర్వహించగలిగామన్నారు. కొన్ని లోపాలు తలెత్తాయని, వాటిని వచ్చే జాతరలో పునరావృతం కాకుండా ఇప్పటి నుంచే చర్యలు చేపడుతామని, జాతర సమగ్రాభివృద్ధి, భక్తులకు శాశ్వత ప్రాతిపదికన మౌలిక సదుపాయాల కల్పనకోసం ప్రణాళిక రూపొందిస్తామన్నారు. అధికారుల అనుభవాలను పుస్తక రూపంలో పొందుపరుస్తామని, గత జాతరతో పోల్చుకుంటే ఈసారి భక్తుల సంఖ్య పెరిగిందని, అయినా అధికారుల సమయస్ఫూర్తితో వ్యవహరించి వసతులు కల్పించారన్నారు. జాతీయ గిరిజన విశ్వవిద్యాలయంలో వచ్చే విద్యాసంవత్సరం నుంచి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని, తరగతుల నిర్వహణకు జాకారంలోని వైటీసీ భవనంలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నట్టు వెల్లడించారు. ఇందుకోసం పంచాయతీరాజ్ శాఖ ద్వారా నిధుల కేటాయింపునకు సీఎం అంగీకరించారని, యుద్ధప్రాతిపదికన పనులు చేపడుతామన్నారు. రామప్ప-లక్నవరం గ్రావిటీ కెనాల్ కోసం భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తిచేసి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి మాట్లాడుతూ... మీడియాలో విస్తృత ప్రచారం జరగడంతో మేడారం జాతరకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారని, కవరేజీ కోసం నూతనంగా మీడియా టవర్‌ను నిర్మించామన్నారు. ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ.. స్వల్ప ట్రాఫిక్‌జామ్ మినహా జాతరను సక్సెస్ చేశామని, శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా, గద్దెలు, జాతర పరిసరాల్లో రద్దీ నియంత్రణపై పక్కాగా చర్యలు తీసుకున్నామన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క, కలెకర్, ఎస్పీ, ఆయా శాఖల అధికారులు, ములుగు జిల్లా మీడియా ప్రతినిధులను జ్ఞాపిక, ప్రశంసాపత్రం, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, మేడారం ఈవో రాజేంద్రం, పౌరసంబంధాల శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మణ్, ములుగు డీపీఆర్‌వో ఎమ్డీ.రఫిక్, ములుగు డీఎస్పీ రవీందర్, తహసీల్దార్ విజయభాస్కర్, ఇన్‌చార్జి డీపీవో తుల రవి, సీఐ రంజిత్, ఎస్‌ఐ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ శాఖలో భారీగా బదిలీలు

హనుమకొండ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రానున్న లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని రెవెన్యూశాఖలో పెద్ద ఎత్తున బదిలీలు జరిగా యి. బుధవారం రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిత్తల్ ఈ మేరకు ఉత్తర్వులను జారీ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 40మంది రెవెన్యూ అధికారులు బదిలీ అయ్యారు. సుదీర్ఘకాలం పాటు ఒకే చోట పని చేస్తున్న అధికారులకు స్థాన చలనం జరిగింది. సూర్యాపేట అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ)గా పనిచేస్తున్న అర్రమాడ వెంకట్ రెడ్డిని హనుమకొండ అడిషనల్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు.

హనుమకొండ అడిషనల్ కలెక్టర్‌గా పనిచేస్తున్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ సీహెచ్ మహేందర్‌జీ ములుగు అడిషనల్ కలెక్టర్‌గా బదిలీ అయ్యారు. ప్రస్తుతం ములుగు అడిషనల్ కలెక్టర్‌గా పని చేస్తున్న స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ డి.వేణుగోపాల్ భద్రాద్రి కొత్తగూడెం అడిషనల్ కలెక్టర్‌గా, పరకాల ఆర్‌డీవోగా పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ కె.శ్రీనివాసరెడ్డి కల్లూరు ఆర్‌డీవోగా, ఆదిలాబాద్ ఆర్‌డీవోగా పని చేస్తున్న స్రవంతి బ్రహ్మరౌతు వరంగల్ ఆర్‌డీవో, ఆర్మూర్ ఆర్‌డీవోగా పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ టి.వినోద్‌కుమార్ భూపాలపల్లి ఎల్‌ఏ అండ్ ఆర్‌ఆర్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌గా, భూపాలపల్లి ఆర్‌డీవోగా పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ కె.రమాదేవి మెదక్ ఆర్‌డీవోగా, వరంగల్ ఆర్‌డీవోగా పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఎం.వాసుచంద్ర నారాయణ్‌పేట్ ఆర్‌డీవోగా, స్టేషన్‌ఘనపూర్ ఆర్‌డీవోగా పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ వి రామ్మూర్తి ఏటూరునాగారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (గిరిజన సంక్షేమం)గా, హనుమకొండ ఆర్‌డీవోగా పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఎల్.రమేష్ సిరిసిల్ల ఆర్‌డీవోగా బదిలీ చేశారు.

హైదరాబాద్ స్పెషల్ ఎగ్జిగ్యూటివ్ మెజిస్ట్రేట్‌గా పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ డి.కొమురయ్య జనగామ ఆర్‌డీవోగా, జనగామ ఆర్‌డీవోగా పని చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ మురళీకృష్ణారెడ్డి హైదరాబాద్ సెక్రెటరియేట్‌లో అధికార భాష ఇన్స్‌పెక్టింగ్ ఆఫీసర్‌గా, ఏటూరునాగారం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (టీడబ్ల్యు) డిప్యూటీ కలెక్టర్ డీఎస్ వెంకన్న స్టేషన్‌ఘనపూర్ ఆర్‌డీవోగా, నారాయణ్‌ఖేడ్ ఆర్‌డీవోగా పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఎస్.వెంకటేశ్ హనుమకొండ ఆర్‌డీవోగా, భూపాలపల్లి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎల్ఏ, ఆర్‌అండ్‌ఆర్‌గా పనిచేస్తున్న కె.నారాయణరెడ్డి పరకాల ఆర్‌డీవోగా బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మల్టీజోన్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ల ట్రాన్స్‌ఫర్

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 28: రాష్ట్ర పోలీసు విభాగం మల్టీ జోన్ -1 పరిధిలో ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేస్తూ మల్టీ జోన్ -1 ఐజీ ఏవీ రంగనాథ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జోన్ పరిధిలో 65 మందిని బదిలీ చేయగా పోలీసు కమిషనరేట్ నుంచి 7 గురు బదిలీ అయ్యారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ
ఒ. రమేష్	వరంగల్ ఎస్బీ	కరీంనగర్ - 2 టౌన్
సీహెచ్ శ్రీధర్	వరంగల్	సరెండర్ మల్టీ జోన్ -1
ఎస్.వెంకట్రాంనాయక్	వరంగల్	సరెండర్ మల్టీ జోన్ -1
బి. శంకర్	సీసీఎస్ వరంగల్	సరెండర్ మల్టీ జోన్-1
ఎం. శివకుమార్	సిద్దిపేట	వరంగల్ కమిషనరేట్
ఎస్. రవికుమార్	మల్టీజోన్ -1	వరంగల్ కమిషనరేట్
పులి వెంకటి	వరంగల్	హుజూరాబాద్ రూరల్

కాళేశ్వరాన్ని రాజకీయాలకు వాడుకోవద్దు


ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 28: సాంకేతిక, ఇతర లోపాలతో మేడిగడ్డ మూడు పిల్లర్లు కుంగి ఉంటాయని, నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారులతో విచారణ చేసి చర్యలు తీసుకో వాలి కానీ రాజకీయాల కోసం కాళేశ్వరాన్ని వాడుకోవద్దని మాజీ ఉప ముఖ్య మంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హితవు పలికారు. బుధవారం హనుమకొండలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతిపక్ష పా ర్టీలపై విరుచుకుపడుతూ మగతనం అనే పదం పదేపదే ఉచ్చరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి.. లోక్ సభ ఎన్నికల్లో 17 ఎంపీ స్థానాలు గెలిచి తన మగ తనాన్ని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక తన భాష మార్చుకుని హుందాగా వ్యవహరిస్తాడనుకున్నామని కానీ రేవంత్‌రెడ్డి తాను సీఎం అనేది మరిచి మాట్లాడుతున్నాడని విమర్శించారు. కేసీ ఆర్ పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసి రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపారని ఆయన కొనియాడారు. కేసీఆర్ సాధించిన విజయాలను వైఫల్యాలుగా చిత్రీకించే ప్రయత్నం కాంగ్రెస్ చేస్తోం దని కడియం ఆరోపించారు. కాంగ్రెస్ వైఖరి తెలం గాణ ప్రతిష్ఠను జాతీయ స్థాయిలో దిగజా ర్చుతోందన్నారు. మేడిగడ్డను రాజకీయాల కోసం వాడుకోకుండా కాంగ్రెస్‌కు చిత్తశుద్ధి ఉంటే మరమ్మతులు చేయించి రైతులకు ఉపయోగంలోకి వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. మేడిగడ్డ పూర్తిగా కొట్టుకుపోవాలనే దుర్మార్గపు ఆలోచనలో కాంగ్రెస్ ఉందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ చిల్లర రాజకీయాలు మానుకుని ఆరు గ్యారంటీలను వందరోజుల్లో అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కుటుంబ రాజకీయాలను ప్రోత్సహిచేదే కాంగ్రెస్ పార్టీ అన్నారు. ఇప్పటికీ ఇందిరాగాంధీ పేరు చెప్పంది ఆ పార్టీకి పూట గడవదన్నారు. రేవంత్‌రెడ్డి భయపడాల్సిన అవసరం లేదని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చే ఆలోచన బీఆర్ఎస్‌కు లేదన్నారు. కానీ సొంత పార్టీ వారితోనే సీంకు ముప్పు ఉందని హెచ్చరించారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ చేస్తున్న విషప్రచారాన్ని తిప్పికొ ట్టేందుకు, రాష్ట్ర ప్రజలకు వాస్తవాలు వెల్లడిం చేందుకే మార్చి 1న బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కాళేశ్వ రం వెళుతున్నామన్నారు. సమావేశంలో ఎంపీ పసునూరి దయాకర్, బీఆర్ఎస్ వరం గల్ జిల్లా అధ్యక్షుడు అరూరి రమేశ్, మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి పాల్గొన్నారు.

సెంట్రల్ లైటింగ్ పోల్‌ను ఢీకొట్టిన కారు

ఇద్దరికి తీవ్ర గాయాలు, ఒకరి పరిస్థితి విషమం


కొడకండ్లలో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన కారు

కొడకండ్ల ఫిబ్రవరి 28: మండలకేంద్రం నుంచి రామవరం వైపు వెళ్ళే రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రత్యక్ష సాక్ష్యులు, కుటుంబసభ్యుల తెలిపిన వివరాల ప్రకారం.. రామవరం గ్రామానికి చెందిన వంగపండ్ల కృష్ణకుమార్ హైదరాబాద్‌లో ఉంటున్నాడు. ఈ నెల 29 వ తేదీన తన అక్క వివాహం ఉండగా తన మేనబావలైన వంశీ, సందీప్‌తో కలిసి బుధవారం ఉదయం వచ్చాడు. పెళ్లి పనుల మీద ఈ ముగ్గురు బయటకు వెళ్లి వస్తుండగా కొడకండ్ల మోడల్ స్కూల్ ఎదుట కారు అదుపు తప్పి డివైడర్ ఎక్కి సెంట్రల్ లైటింగ్ పోల్‌ను ఢీకొట్టింది. దీంతో కారు నడుపుతున్న కృష్ణకుమార్ తలకు తీవ్రగాయమవ్వగా సందీప్‌కు ఎడమకాలు విరిగింది. వంశీ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న కుటుంబసభ్యులు వెంటనే వారిని జనగామకు తరలించి వైద్యుల సూచన మేరకు అక్కడి నుంచి హైదరాబాద్ నిమ్స్‌కు తీసుకెళ్లారు. కృష్ణకుమార్‌కు ఇద్దరు అక్కలు ఉండగా చిన్న అక్కకు గురువారం వివాహం జరుగనుంది. పెళ్ళి ముందు రోజు ఈ ప్రమాదం జరగడంతో అందరూ తీవ్ర ఆందోళన చెందుతున్నారు. కాగా, ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

నారాయణపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

బచ్చన్నపేట, ఫిబ్రవరి 28: ఆర్వీఎం ఆస్పత్రి నేతృత్వంలో బుధవారం నారాయణపూర్ గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సుమారు 200 మందిని పరీక్షించి ఉచితంగా మందులు అందించారు. వైస్ ఎంపీపీ కల్లూరి అనిల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి దేవిప్రసాద్, ప్రభాకర్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.


జనగామ సెయింట్ పాల్స్ స్కూల్‌లో చార్టులు ప్రదర్శిస్తున్న విద్యార్థులు


జనగామ ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో ఎగ్జిబిట్లను పరిశీలిస్తున్న డీఈవో రాము


స్టేషన్‌ఘన్‌పూర్ సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో సైన్స్ ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

ఘనంగా సైన్స్ దినోత్సవం

- సీవీ రామన్‌కు ఘన నివాళులు
- ఎగ్జిబిట్లను ప్రదర్శించిన విద్యార్థులు

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 28: భారతీయ శాస్త్రవేత్త, నోబెల్ పురస్కార గ్రహీత సర్ సి.వి.రామన్ జన్మదినాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ పాల్స్ స్కూల్లో సుమారు 200 మంది విద్యార్థులు ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్, రోబోటిక్స్ మొదలగు సాంకేతిక నమూనాలను తయారు చేసి ప్రదర్శనలో ఉంచారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మరియజోసెఫ్ విద్యార్థులను అభినందిస్తూ మాట్లాడారు. పాఠశాలలో నెలకొల్పిన అటల్ టింకరింగ్ ల్యాబ్ విద్యార్థులకు ఎంతగానో తోడ్పడుతోందన్నారు. అనంతరం విద్యార్థుల ఎదుగుదలకు కారకులైన సైన్స్ ఉపాధ్యాయులను అభినందించారు.

ఏకశిల పబ్లిక్ స్కూల్ లో ...

జిల్లాకేంద్రంలోని ఏకశిల పబ్లిక్ స్కూల్లో సైన్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. మూడు రోజులుగా విద్యార్థులచే సైన్స్ సెమినార్ ప్రజెంటేషన్స్, సైన్స్ క్విజ్ పోటీలు, టాలెంట్ టెస్టులు, సైన్స్ క్వెస్ట్ - 2024 కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. 450 మంది విద్యార్థులు కలిసి 220 సైన్స్ ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ఏకశిల విద్యా సంస్థల కార్యదర్శి చిర్ర ఉపేందర్‌రెడ్డి అధ్యక్షత వహించగా డీఈవో కె.రాము, ట్రస్మా రాష్ట్ర అడ్వయిజర్ ఇ.ప్రభాకర్‌రెడ్డి, రిటైర్డ్ కల్నల్ డాక్టర్ మాచర్ల భిక్షపతి విలువైన సందేశాలనిచ్చారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్ బహూకరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సి.ఇందిర తదితరులు పాల్గొన్నారు.

సెయింట్ మేరీస్ పాఠశాలలో ...

జనగామ సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో సైన్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రిన్సిపాల్ జైమోన్ థామస్ ఆధ్వర్యంలో ప్రఖ్యాత శాస్త్రవేత్త సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఒలింపియాడ్ పరీక్షలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మెడల్స్ అందజేసి అభినందించారు. కార్యక్రమంలో రంగరాజు ప్రసాద్, జయపాల్‌రెడ్డి, రమణారెడ్డి, జ్యోతిలక్ష్మి, నరేష్, శాలిం, షబానా, శ్రీలేఖ, శైలజ, మౌనిక, అరుణ, రేవతి తదితరులు పాల్గొన్నారు.

ధర్మకంచ జడ్పీ పాఠశాలలో ...

జిల్లా కేంద్రం లోని ధర్మకంచ జడ్పీ పాఠశాలలో సైన్స్ మేళా నిర్వహించారు. మునిసిపల్ చైర్‌పర్సన్ పోకల జమున ప్రారంభించారు. స్థానిక కౌన్సిలర్ చంద్రకళ రాజు, 18వ వార్డు కౌన్సిలర్ ప్రేమలతా రెడ్డి, వి.రాజేందర్ అతిథులుగా హాజరై సైన్స్ మేళాను తిలకించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి హెచ్ఎం జి.శ్రీనివాస్ అధ్యక్షత వహించగా డాక్టర్ స్వప్న ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకోవాలని తెలియజేశారు. విద్యార్థులు వర్కింగ్ మోడల్స్ తయారు చేసి ప్రజెంటేషన్ చేశారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు ఆర్.బాలరాజు, కె.మారుతి ప్రసాద్, ఎ.లింగారెడ్డి, తహెర మసూద్ జహాన్ తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్: విద్యార్థులు పాఠశాల దశలోనే శాస్త్రీయ దృక్పథాన్ని అలవరచుకుని శాస్త్రవేత్తలుగా ఎదగడానికి కృషి చేయాలని మండల నోడల్ అధికారి జి.కొమురయ్య అన్నారు. బుధవారం జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని చాగల్లు హైస్కూల్‌లో విద్యార్థులు ఏర్పాటు చేసిన సైన్స్ ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు ప్రతీ విషయాన్ని తార్కికంగా ఆలోచించి కారణాలు తెలుసుకునే ప్రయత్నం చేయాలన్నారు. సైన్స్‌ఫెయిర్‌లో విద్యార్థులు ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్లను, సైన్స్ ముగ్గులను పలువురు తిలకించి అభినందించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు ఎం.శ్రీరాంరెడ్డి, పి.శ్రీనాథ్, రవికుమార్, సీఆర్పీ పి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ సెయింట్ మేరీస్ హైస్కూల్‌లో 70 మంది విద్యార్థులు ఏర్పాటు చేసిన 25 ఎగ్జిబిట్లు ప్రదర్శించారు. సృజనాత్మకత అంశాలతో పాటు సైన్స్, టెక్నాలజీ, కాలుష్య నివారణ, నూతన వ్యవసాయ ఆవిష్కరణలు తదితర అంశాలపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిట్లు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ షైనీ జోమీ జోసఫ్, ఉపాధ్యాయులు షారూన్, డి.జోసఫ్, అనిత, సింఫోనియా, సౌజన్య, పద్మావతి, అలేఖ్య, లింగయ్య, పీఈటీ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

చిలుపూర్: మండలంలోని పల్లగుట్ట, చిలుపూర్, చిన్నపెండ్యాల తదితర గ్రామాల్లో గల ఉన్నత పాఠశాలల్లో హెచ్ఎంలు కేతిరి నరసింహారెడ్డి, దాసి శ్రవన్‌కుమార్, సంపత్‌ల ఆధ్వర్యంలో సర్ సివి రామన్ చిత్ర పటానికి పూలమాలలు వేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో రంగోళి పోటీలతో పాటు, క్విజ్, ఉపన్యాస పోటీలను నిర్వహించి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. సైన్స్ ఆవశ్యకతను వివరించారు. ఉపాధ్యాయులు కోమలి, నరసింహారావు, ప్రకాశ్, సురేశ్, లక్ష్మి, మూర్తి, రోజా, రామ్మూర్తి పాల్గొన్నారు.

కొడకండ్ల: మండలకేంద్రంలోని ఎస్సీకాలనీ ప్రాథమిక పాఠశాల, కస్తూరిబా బాలికల పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు అనేక రకాల సైన్స్ ప్రయోగాల నమూనాలతో అలరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దోర్నం ప్రభాకర్, ఉపాధ్యాయులు కుసుమ రాజు, గడ్డం కవిత, శారద, తదితరులు పాల్గొన్నారు.

జఫర్‌గడ్: జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని బుధవారం మండలంలోని కూనూరు, జఫర్‌గడ్, తదితర జడ్పీ, ప్రాథమిక పాఠశాలల్లో వేడుకలను నిర్వహించారు. సీవీ రామన్ చిత్రపటానికి హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కూనూరు, జఫర్‌గడ్ పాఠశాలల్లో మూఢ నమ్మకాల నిర్మూలనపై నాటికలు, సైన్స్ క్విజ్ పోటీలతో పాటు వివిధ అంశాలపై శాస్త్రీయ ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నోడల్ అధికారి ఎండి.పర్వేజ్, హెచ్ఎం గణేష్‌రెడ్డి, ఉపాధ్యాయులు చంద్రమోహన్, స్వరూపారాణి, విజయశ్రీ, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, రమేశ్‌బాబు, రవి, రాజెందర్, గిరిజ, సిరాజ్, కరుణశ్రీ, శంకర్, ఉమ, యాదగిరి, ప్రతాప్‌రెడ్డి, వేణుగోపాల్, సుష్మిత, సుదర్శనం, ప్రకాశ్, అనిల్, వంశీకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.


జనగామ సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో సీవీ రామన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

వనదేవతలకు తిరుగువారం పూజలు


ఇప్పగూడెం - చింతగట్టు జాతరలో పూజలు చేస్తున్న భక్తులు

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 28 : వన దేవతల జాతరను పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాల్లో తిరుగువారం పండుగను ఘనంగా నిర్వహించారు. బుధవారం మండలంలోని ఇప్పగూడెం - చింతగట్టు, తాటికొండ పరిధిలోని జిట్టెగూడెం గ్రామాల్లో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవో లక్ష్మీప్రసన్న, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, మందపురం ఎల్లగౌడ్, జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, కోరుకొప్పుల మహేందర్ గౌడ్ ఆధ్వర్యంలో డప్పుచప్పుళ్ళు, మేళతాళాల మధ్య వన దేవతలకు ప్రత్యేక పూజలు చేపట్టి జంతుబలి అర్పించారు. గ్రామస్థులు పెద్దసంఖ్యలో తల్లులను దర్శించుకుని మొక్కులు సమర్పించారు. ఈ కార్యక్రమంలో కత్తుల కట్టయ్య, కుంట మల్లేషం, మందపురం బాష, లింగనబోయిన వెంకటేశ్వర్లు, శివాజీ, శివరాత్రి సారంగం, వెంకటమల్లు తదితరులు పాల్గొన్నారు.

చిలుపూర్: మండలంలోని పలు గ్రామాల్లో తిరుగువారం పండుగను బుధవారం ఘనంగా నిర్వహించారు. లింగంపల్లిలో ఈవో చిందం వంశీ నేతృత్వంలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోయ పూజారి నర్సమ్మ ఆధ్వర్యంలో డప్పుచప్పుళ్ళు, మేళతాళాల మధ్య సమ్మక్కకు ప్రత్యేక పూజలు చేపట్టి జంతుబలి అర్పించారు. శ్రీపతిపల్లి - కొండాపూర్, ఫతేపూర్ - గార్లగడ్డ, చిలుపూర్ గుట్టు జాతరల్లో తిరుగువారం పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీటీసీ కంకటి రవీందర్, చైర్మన్లు కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి, బొళ్ళ రాజ్‌కుమార్, వైస్ చైర్మన్ రావులపల్లి వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచులు ఏదునూరి రవీందర్, ఉద్దెమారి రాజ్‌కుమార్, కంకటి రాజన్న, తోట శ్రీనివాస్, అపరాధపు రాజు, సిద్ధులు, మోతె శ్రీనివాస్, తౌటి రమేష్, రచ్చ రవిందర్, దేవాదాయ శాఖ సీనియర్ అసిస్టెంట్ చల్ల రాజేందర్ రెడ్డి, రజాక్, పంచాయతీ సెక్రటరీ పూల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'గృహజ్యోతి' అమలు

200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్

జనగామ టౌన్, ఫిబ్రవరి 28: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీల్లో ఒకటైన గృహజ్యోతి పథకం మార్చి 1 నుంచి అమలులోకి రానుంది. 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు అందివ్వనున్నట్లు విద్యుత్ శాఖ జనగామ సూపరింటెండెంట్ తంగెళ్లపల్లి వేణుమాధవ్ బుధవారం ప్రకటించారు. ప్రజాపాలనతో దరఖాస్తు చేసుకున్న తెల్ల రేషన్ కార్డుదారులే ఇందుకు అర్హులని స్పష్టం చేశారు. ఎవరైనా దరఖాస్తు చేసుకోనివారు, వివరాలు తప్పుగా ఇచ్చిన వారు ఉంటే ఇప్పటికైనా ఎంపీడీవో, మునిసిపల్ కార్యాలయంలో విద్యుత్ కనెక్షన్ నంబర్, తెల్ల రేషన్‌కార్డు వివరాలతో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. దరఖాస్తు పెండింగ్‌లో ఉన్నా బిల్లు వసూలుకు ఎలాంటి ఒత్తిడి చేయబోమని చెప్పారు. అర్హులైన వారికి 200 యూనిట్ల లోపు జీరో బిల్లు ఇస్తామని పేర్కొన్నారు.

కాంగ్రెస్‌లోకి నారాయణపూర్ మాజీ సర్పంచ్

బచ్చన్నపేట, ఫిబ్రవరి 28: చేర్యాల వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, నారాయణపూర్ మాజీ సర్పంచ్ మాసపేట రవీందర్‌రెడ్డి బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో పార్టీ కండువా కప్పుకున్నారు. గత సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీలో ఉండగా, అనంతరం జరిగిన పరిణామాలతో బీఆర్ఎస్‌లో చేరారు. తిరిగి సొంతగూటికి చేరుకున్నారు. ఆయన వెంట మాజీ సర్పంచ్ వేముల వెంకట్‌గౌడ్, మేకల రాజు, జంగిటి విద్యానాథ్, దిడిగ రమేశ్ తదితరులున్నారు.

ఎమ్మార్పీఎస్ ఉద్యమాన్ని బలోపేతం చేయాలి

బచ్చన్నపేట, ఫిబ్రవరి 28: మాదిగ, ఉపకులాల వర్గీకరణకు సంబంధించి నెరవేరే సమయం ఆసన్నమైందని, కీలక సమయంలో నిర్మాణాత్మక ఉద్యమం నడపాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధానకార్యదర్శి రాగల్ల ఉపేందర్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మార్చి 1న గ్రామాల్లో మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు పైస రాజశేఖర్, అల్వాల రాజు, సందెన రవీందర్, అల్వాల నర్సింగరావు, పాకాల కుమార్, నల్ల అంజయ్య, కర్రె శ్రీనివాస్, వెంకటేశ్, ప్రసాద్, నరేష్, రాజు, అజయ్, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ వృద్ధుడికి అంత్యక్రియలు

చిలుపూర్, ఫిబ్రవరి 28 : మండలంలోని వంగాలపల్లిలో అనారోగ్యం కారణంగా మృతిచెందిన రామోజీ పాండు (80) అనే అనాథ వృద్ధుడికి బుధవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ ఆరూరి ప్రణీత ప్రభుదాస్, పంచాయతీ సెక్రటరీ స్నేహ మాట్లాడుతూ 20 ఏళ్ళుగా గ్రామంలోనే భిక్షాటన చేస్తున్న రామోజీ గ్రామంలో ఆధార్‌కార్డు కలిగి ఉండడంతో పాటు, ఆసరా పెన్షన్ సైతం వస్తోందని, కుటుంబ సభ్యులతో పాటు, బంధువులెవరూ లేకపోవడంతో పోలీసుల సూచనలతో జీపీ సిబ్బందితోనే అంత్యక్రియలు నిర్వహించామని తెలిపారు.

అంకుషాపూర్‌లో వ్యక్తి ఆత్మహత్య

తరిగొప్పుల, ఫిబ్రవరి 28: మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో దేవరాజుల ఎల్లయ్య(53) అనే వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్సై శ్వేత తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లయ్య కుటుంబసభ్యులు కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉండగా తను ఒక్కడే ఇక్కడ ఉంటున్నాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. కాగా, ఆత్మహత్యకు కారణాలు తెలియాల్సి ఉందని ఎస్సై తెలిపారు.

సోషల్ మీడియా సభ్యుడిగా వేణుగోపాల్‌గౌడ్

బచ్చన్నపేట, ఫిబ్రవరి 28: బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా సభ్యుడిగా మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన వేముల వేణుగోపాల్‌గౌడ్‌ను నియమిస్తున్నట్లు రాష్ట్ర కన్వీనర్ కొమర్‌రాజు సుమిరన్ ఓ ప్రకటనలో తెలిపారు. గతంలో బీజేవైఎం సోషల్ మీడియా విభాగంలో వేణుగోపాల్ చురుకుగా వ్యవహరించటంతో ఆయనకు ఈ అవకాశం ఇచ్చినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.

టైలర్స్ డే వేడుకలు


పాలకుర్తిలో జెండా ఎగురవేస్తున్న మేరు కుల సంఘం బాధ్యులు

పాలకుర్తి, ఫిబ్రవరి 28: మండల కేంద్రంలో మేరు సంఘం ఆధ్వర్యంలో బుధవారం జెండాను ఎగురవేసి ఘనంగా టైలర్ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం మండల అధ్యక్షుడు కీర్తి రాజ్‌కమల్ మాట్లాడుతూ కుట్టు మిషన్ సృష్టికర్త విలియమ్ ఎలియాస్ హో జన్మదినాన్ని ప్రపంచ వ్యాప్తంగా ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుట్టు మిషన్ వృత్తి దారులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. బ్యాంకులకు లింకు లేకుండా రుణాలివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సోమ వెంకన్న, సోమ సత్యం, అశోక్‌బాబు, మండల ప్రధాన కార్యదర్శి కొత్తకొండ వాసు, సోమ రాములు, ప్రభాకర్, వీరస్వామి పాల్గొన్నారు.

బచ్చన్నపేట: టైలర్స్‌ను ప్రభుత్వం ఆదుకోవాలని టైలర్స్ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ గాలి తిరుపతి కోరారు. టైలర్స్‌డేను పురస్కరించుకుని మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక సమావేశాలు నిర్వహించారు. కేశిరెడ్డిపల్లిలో జరిగిన సమావేశంలో తిరుపతి మాట్లాడుతూ ప్రభుత్వం 50 ఏళ్లు నిండిన టైలర్ పని చేసే వారికి పింఛన్ ఇవ్వాలన్నారు. రూ. 5 లక్షల వరకు వడ్డీలేని రుణ మంజూరుకు అవకాశం కల్పించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కనకయ్య, రాజయ్య, ఎల్లయ్య, బీరయ్య, రాజు, మల్లయ్య, నర్సింగ్, అభయ్, సుధాకర్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రమోద్‌కుమార్‌కు ఎక్స్‌లెన్స్ అవార్డు


అవార్డు అందుకుంటున్న ప్రమోద్ కుమార్

జనగామ కల్చరల్, ఫిబ్రవరి 28: జిల్లా కేంద్రానికి చెందిన లయన్స్ క్లబ్ ప్రతినిధి గంగిశెట్టి ప్రమోద్ కుమార్ ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్నారు. వివిధ రంగాలలో ఆయన అందించిన సేవలకు గాను బుధవారం హన్మకొండ లయన్స్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో జీఏటీ ఏరియా లీడర్ దీపక్ భట్టాచార్య, మల్టిపుల్ కౌన్సిల్ చైర్మన్ తీగల మోహన్‌రావు చేతుల మీదుగా ఇంటర్నేషనల్ ఎక్స్‌లెన్స్ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ప్రమోద్‌కుమార్ మాట్లాడుతూ ఈ అవార్డు తీసుకోవడం వల్ల తన బాధ్యత మరింతగా పెరిగిందన్నారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా గవర్నర్ కన్న పరశురాములు, వెంకటేశ్వర్‌రావు, విద్యాసాగర్ రెడ్డి, చంద్రగిరి ప్రసాద్, నాగబండి రవీందర్, అల్లాడి ప్రభాకర్, కృష్ణ జీవన్ బజాజ్, కుర్రెముల పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నర్మెట, ఫిబ్రవరి 28: మండలంలోని అమ్మాపురం గ్రామంలో మార్చి 1న విద్యుత్ సరఫరాలో ఉంటుందని ఏఈ నర్సింహులు బుధవారం తెలిపారు. 220కేవీ విద్యుత్ లైన్ పనుల కారణంగా ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. ప్రజలు, రైతులు, విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

జాతర హుండీ ఆదాయం రూ.1. 81 లక్షలు

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 28 : మండలంలోని తాటికొండ - జిట్టెగూడెం సమ్మక్క సారలమ్మ జాతర హుండీ ఆదాయం రూ.1.81 లక్షలు సమకూరిందని జాతర కమిటీ చైర్మన్ కోరుకొప్పుల మహేందర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, గ్రామస్థులతో కలిసి ముందుగా వన దేవతల సన్నిధిలో ప్రత్యేక పూజలు చేశారు. మొక్కులు చెల్లించిన అనంతరం హుండీల్లో భక్తులు వేసిన కానుకలను లెక్కించారు. ఈ సందర్భంగా చైర్మన్ కోరుకొప్పుల మహేందర్ మాట్లాడుతూ, రాబోవు రోజుల్లో గ్రామస్థుల సహకారంతో జాతరను మరింతగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ మారపాక రాములు, నాగరాజు, యాదగిరి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో బొడ్రాయికి పూజలు

నర్మెట, ఫిబ్రవరి 28: మండలంలోని ఇప్పలగడ్డ గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠకార్యక్రమాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం గ్రామంలోని వీధుల గుండా బొడ్రాయిని ట్రాక్టర్‌లో ఊరేగించగా గ్రామస్థులంతా భక్తిశ్రద్ధలతో బొడ్రాయికి నీళ్లు పోసి మొక్కులు చెల్లించారు. నేడు గ్రామంలో బొడ్రాయిని ప్రతిష్ఠించనున్నట్లు మాజీ సర్పంచ్ నీరటి రాణి తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు పాల్గొన్నారు

పాఠశాలల్లో స్వయంపాలన

చిలుపూర్, ఫిబ్రవరి 28 : స్వయంపాలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండలంలోని మల్కాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులే ఉపాధ్యాయులుగా వ్యవహరించి పలువురి మన్ననలు పొందారు. 1 నుంచి 5వ తరగతి వరకు విద్యాబోధన చేశారు. హెచ్ఎంగా లోకేశ్, డీఈవోగా శివ రాజు, ఎంఎన్‌వో (మండల నోడల్ అధికారి)గా ప్రవీన్‌నాయక్, కాంప్లెక్స్ హెచ్ఎంగా అంజితో పాటు, ఉపాధ్యాయులుగా పలువురు విద్యార్థులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రవిబాబు, ఉపాధ్యాయులు అంద్రు శ్రీదేవిరెడ్డి, శోభారాణి, కల్యాణి, సరస్వతి, రమేష్ పాల్గొన్నారు.

జఫర్‌గడ్: జఫర్‌గడ్ జడ్పీ హైస్కూల్‌లో బుధవారం స్వయం పాలనా దినోత్సవం నిర్వహించారు. బాల బాలికలు విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించి ప్రశంసలందుకున్నారు. హెచ్ఎంగా రేష్మ, డీఈవోగా ఆయేషా, ఎంఈవోగా సనా చక్కగా వ్యవహరించారు. కార్యక్రమంలో హెచ్ఎం గణేష‌రెడ్డి, ఉపాధ్యాయులు ప్రతాప్‌రెడ్డి, వేణుగోపాల్, సుష్మిత, సుదర్శనం, ప్రకాశ్, అనిల్, వంశీకృష్ణ, విద్యార్థులు పాల్గొన్నారు.

బచ్చన్నపేట: మండలంలోని నారాయణపూర్, ఆలీంపూర్ పాఠశాలల్లో బుధవారం స్వయంపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా బాధ్యతలు నిర్వహించి ప్రశంసలు అందుకున్నారు. ప్రతిభ చూపిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మల్కాపూర్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు


జఫర్‌గడ్ హైస్కూల్‌లో విద్యార్థులతో ఉపాధ్యాయులు


నారాయణపూర్‌లో స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు